కందనూలులో బీజేపీ జెండా ఎగరవేద్దాం

- ఎంపీ పోతుగంటి రాములు

బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రాములు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 18: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరవేసి ప్రధాని నరేంద్రమోదీకి బహుమతిగా ఇద్దామని బీజేపీ నాయకుడు, ఎంపీ పోతుగంటి రాములు పిలుపునిచ్చారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల బీజేపీ బూత్ కమిటీల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్, నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ రావు పాల్గొని మాట్లాతూ ప్రతి కార్యకర్త పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జక్కా రఘునందన్ రెడ్డి, దిలీప్ చారి, జిల్లా, మండల నాయకులు, బూత్ కమిటీ అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

వైద్య సేవలు అందించడంలో డాక్టర్ల పాత్ర కీలకం

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ : వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, ఏప్రిల్ 18 : ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు డాక్టర్లు చేస్తున్న సేవలతో ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, సీఎం సోదరుడు ఎనుముల కిష్టారెడ్డి అన్నారు. వెల్దండ మండల కేంద్రంలో రిక్రియేషన్ క్లబ్ సౌజన్యంతో యశోద దవాఖాన, కల్వకుర్తి వెంకటరమణ దవాఖానల సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత శిబిరంలో పేద ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమగు వారికి మందులు అందించడం ఎంతో అభినందనీయమని డాక్టర్లు శరత్ రంజిత్‌ను అభినందించారు. మొత్తం 250 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ విష్ణు వర్ధన్‌రెడ్డి, ఎస్సై రవి, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు బచ్చురామకృష్ణ, క్లబ్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి ఆంజనేయులు, సంజీవ్‌యాదవ్, పర్వత్‌రెడ్డి, మోతీలాల్ నాయక్, శశుపాల్ రెడ్డి, యన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎర్ర శ్రీను, డాక్టర్ నాగరాజు, వైద్యులు పాల్గొన్నారు.

చారకొండలో..

చారకొండ, ఏప్రిల్ 18: చారకొండ మండలం సిరుసనగండ్ల సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో చారకొండకు చెందిన వైద్యుడు చిలువేరు శ్రీనివాసులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తన తండ్రి మల్లప్ప జ్ఞాపకార్థం ప్రతి ఏటా భక్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నట్లు ఆయన చెప్పారు. పేదలకు సేవ చేయడం తృప్తిని ఇస్తుందన్నారు.

కల్తీ పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు

బేకరీలో తనిఖీ చేస్తున్న అధికారులు

బిజినేపల్లి, ఏప్రిల్ 18: హోటళ్లు, బేకరీల్లో కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి మనోజ్ అన్నారు. మండల కేంద్రంలోని బెంగళూర్ అయ్యంగారి బేకరి, హోటల్స్‌ను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి తిను బండారాలను పరిశీలించి శాంపిల్స్ సేకరించారు. సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించనున్నట్లు తెలిపారు. పరిశీలనలో కల్తీ జరిగినట్లు తేలితే యజమానిపై శాఖపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. హోటల్స్, బేకరీల్లో పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట సిబ్బంది వాజీద్ తదితరులు ఉన్నారు.

బెల్ట్ షాపులపై ఉక్కుపాదం

- 181లీటర్ల సారా స్వాధీనం
- 15మంది అరెస్ట్
- ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి

కొల్లాపూర్, ఏప్రిల్ 18: కొల్లాపూర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో కొనసాగుతున్న బెల్ట్‌షాపులు, సారా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం మోపినట్లు ఎక్సైజ్ సీఐ బీ.నాగిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన 'నమస్తేతెలంగాణ'తో మాట్లాడుతూ గత నెల 16వ తేదీ నుంచి పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. అప్పటి నుంచి ఈనెల 17వ తేదీ వరకు బెల్ట్ షాపులు, గిరిజన తండాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించి 49 సారా కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల సందర్భంగా 181లీటర్ల సారా, 30 కిలోల బెల్లం, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకోవడంతోపాటు 15మంది నిందితులను అరెస్ట్ చేశామన్నారు. దాడుల నేపథ్యంలో 19,050 లీటర్ల బెల్లం ఊట పారబోసి 11మందిని అదుపులోకి తీసుకొని తాసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఇందులో ఒకరికి రూ.5వేలు జరిమానా విధించారన్నారు.

పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కల్లు దుకాణాలు, మద్యంషాపుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని లేకుంటే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

రెండు బైకులు ఢీకొని అర్చకుడు మృతి

ప్రమాదంలో మృతి చెందిన బద్రీనాథ్

బిజినేపల్లి, ఏప్రిల్ 18: బైక్ ఢీకొని అర్చకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని పాలెం గ్రామంలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం మేరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వీరన్నపేటకు చెందిన జంగం బద్రీనాథ్(23) బైక్‌పై నాగర్‌కర్నూల్ వైపు వెళ్తుండగా బిజినేపల్లి మండలం పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం సమీపంలో ముందు వెళ్తున్న మరో బైక్ వారు ఇండికేటర్ వేయకుండా సడన్‌గా మళ్లారు. దీంతో ముందు బైక్‌ను తప్పించే క్రమంలో బద్రీనాథ్ బైక్‌ను అజాగ్రత్తగా వెనక నుంచి వస్తున్న మరో బైక్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి మల్లికార్జున్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నాగశేఖర్ రెడ్డి తెలిపారు.

ఎన్నికల వ్యయాలపై ఫిర్యాదు చేయొచ్చు

- పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా సౌరభ్
- జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్

ఎంసీఎంసీ మానిటరింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న పరిశీలకుడు సౌరభ్, కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 18: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల వ్యయసంబంధిత అంశాలపై ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎవరైనా ఎన్నికల వ్యయ పరిశీలకులకు ఫిర్యాదు చేయొచ్చని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్ కుమార్ తెలిపారు. గురువారం కలెక్టర్ జిల్లా ఎన్నికల పరిశీలకుల వివరాలు తెలిపారు. అంతకుముందు కలెక్టర్ తన చాంబర్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు సౌరభ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వ్యయ పరిశీలకుడు కొల్లాపూర్ సోమశిల టూరిజం గెస్ట్‌హౌస్ వద్ద ప్రతిరోజు ఉదయం 8:30 నుంచి 9:30 గంటలకు సాయంత్రం 7 నుంచి 8 గంటల సమయంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ సంబంధించిన ఫిర్యాదుదారులు కలుసుకొని ఫిర్యాదులను అందజేయవచ్చన్నారు. ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలపై అబ్జర్వర్ సెల్ నెంబర్ 80198-32010కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. వ్యయ పరిశీలకులు పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పరిశీలిస్తారని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని మీడియా సర్టిఫికెట్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ)ని పరిశీలించి అందులో జరుగుతున్న సోషల్ మీడియా, పేయిడ్ ఆర్టికల్స్, న్యూస్ రికార్డింగ్, అభ్యర్థుల యాడ్స్ సంబంధించి సర్టిఫికెట్లు వివరాలను వ్యయపరిశీలకులకు కలెక్టర్ వివరించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాతోపాటు సామాజిక, ఇతర మాధ్యమాల్లో వచ్చే రాజకీ య ప్రకటనలు నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. 24 గంటలు పనిచేసే విధంగా కంట్రోల్ రూం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై, 1950 టోల్ ఫ్రీ నెంబర్, సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను కంట్రోల్ రూం ద్వారా క్షేత్రస్థాయి సిబ్బందికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ పరిష్కరిస్తున్నామని వివరించారు. అలాగే జిల్లాలోని అన్ని చెక్ పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తూ సత్వర చర్యలు చేపడుతున్నామన్నారు. మోడల్‌కండక్ట్ కోడ్(ఎంసీసీ), గ్రీవెన్స్ కమిటీలను పరిశీలించి అందులో జరుగుతున్న పనుల వివరాలను వ్యయ పరిశీలకులకు వివరించారు. అనంతరం వ్యయ పరిశీలకులు సౌరబ్, కలెక్టరేట్‌లోని ఎఫ్14 సమావేశ మందిరంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సహాయ వ్యయ నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న విధులను అడిగి తెలుసుకొని, పలు సూచనలు ఇచ్చారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

లింగాల, ఏప్రిల్ 18: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ లింగమ్మ, ఎంపీఈవో ఆంజనేయులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరు అవుతారని, మండలంలోని ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

సలేశ్వరం జాతర ఏర్పాట్ల పరిశీలన

జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

లింగాల, ఏప్రిల్ 18: మండలంలోని నల్లమల లోతట్టు అటవీ ప్రాంతంలోని సలేశ్వరం లింగమయ్య జాతర ఏర్పాట్లను గురువారం తాసీల్దార్ ఉమ, పోలీస్, అటవీశాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి నిర్వహించే సలేశ్వరం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు తగిన ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులు అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు వేయకుండా పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. అడవిలో నిప్పు పెట్టడం వల్ల వన్యప్రాణుల మనుగడకు ఆటంకం కల్గుతుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవీందర్, ఎస్సై జగన్‌మోహన్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ బాలరాం,ఆర్ఐ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో నిందితుల అరెస్ట్

తిమ్మాజిపేట,ఏప్రిల్ 18 : మండలంలోని గొరిట గ్రామంలో అజీజ్ అనే వ్యక్తిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డ నిందితులను గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. ముగ్గురు నిందితులను నాగర్‌కర్నూల్ కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12లక్షలు ఇవ్వాలి

- బీఆర్ఎస్ ఎస్సీసెల్ జిల్లా నాయకుడు దేవని కుమార్ మాదిగ

విలేకరులతో మాట్లాడుతున్న దేవనికుమార్ మాదిగ

కొల్లాపూర్, ఏప్రిల్ 18: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లోని అంబేద్కర్ అభయ హస్తం కింద దళితులకు రూ.12లక్షలు ఇవ్వాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు దేవని కుమార్‌మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు శీలం వెంకటేశ్, బాలకృష్ణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం దళితబంధు పథకం ద్వారా మొదటి విడుతలో గ్రామానికో యూనిట్ మంజూరయిందన్నారు. రెండో విడుతలో 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కొక్క నియోజకవర్గానికి 1,100 యూనిట్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. రెండో విడుతలో కొల్లాపూర్ నియోజకవర్గంలో 1,100 మంది లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమా చేసినా, వారి అకౌంట్ హోల్డ్‌లో పెట్టారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దళితులకు అంబేద్కర్ అభయ హస్తం కింద నిరుపేద దళితులకు రూ.12లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ చూపుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే అంబేద్కర్ అభయ హస్తం పథకం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

అచ్చంపేటరూరల్, ఏప్రిల్ 18: రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. గురువారం పట్టణంలోని టీఎన్‌జీవో భవనంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దేశ్యా నాయక్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఈయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కిందన్నారు. యువతను నిరుద్యోగులుగా, నిరక్షరాస్యులుగా మార్చిందన్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటాయని అన్నారు. పేదోడు చమటోర్చి సంపాదించుకున్న సొమ్ము, దేశ సంపదను ప్రధాని మోదీ తన కార్పొరేట్ మిత్రులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గం పర్యాతాలు, కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీనివాసులు, ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు శంకర్‌నాయక్, మల్లేశ్, నర్సింహా, అశోక్, ఈశ్వర్, బాలస్వామి, నాగరాజు, కాశన్న మండల నాయకులు,శాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరాముడి పట్టాభిషేకం

- సిరసనగండ్ల ఆలయంలో ప్రత్యేక పూజలు

లింగాల : స్వామివారికి హారతి ఇస్తున్న మహిళలు

చారకొండ/అచ్చంపేటటౌన్/లింగాల, ఏప్రిల్ 18: మండలంలోని సిరుసనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అచ్చంపేట పట్టణంలోని భ్రమరాంబ ఆలయంలో ఆలయ అధ్యక్షుడు పోకల శ్రీధర్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య అర్చకులు వెంకటశాస్త్రీ, ఉదయ్‌భాస్కర్ శ్రీరాముడికి పట్టాభిషేకం చేశారు. అలాగే లింగాల మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో అర్చకులు రామాచార్యులు, సుదర్శనచార్యులు ఆధ్వర్యంలో శ్రీరాముడి పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిరసనగండ్ల ఆలయ చైర్మన్ డేరం రామశర్మ, ఇన్‌చార్జి ఈవో శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు మురళీధర్‌శర్మ, అనంతరామశర్మ, లక్ష్మణ్‌శర్మ, గోపీకృష్ణశర్మ, వేణుగోపాలశర్మ, రఘుశర్మ, జయప్రకాశ్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, భ్రమరాంబ ఆలయం, లింగాల కోదండరామాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ గరిష్ఠ ధర రూ.7,080

కల్వకుర్తి, ఏప్రిల్ 18 : కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డుకు గురువారం 16 మంది రైతులు 360 బస్తాల వేరుశనగను విక్రయించేందుకు తీసుకువచ్చారు. గరిష్ఠంగా రూ.7,080కి, కనిష్ఠంగా రూ.5,300 లకు వ్యాపారులు కొనుగోలు చేశారు.

ఆటోను ఢీకొన్న బొలేరో వాహనం

- ఒకరి మృతి, ముగ్గురికి తీవ్రగాయాలు

నరసయ్య(ఫైల్)

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 18: బులేరో వాహనం ఆటో ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని పెద్దకారుపాములకు చెందిన గువ్వల నర్సయ్య(34) తన ఆటోలో ప్రయాణికులతో గ్రామం నుంచి పెద్దకొత్తపల్లికి వెళ్తుండగా మార్గమధ్యలో కోళ్ల లోడ్‌తో వస్తున్న బొలేరో వాహన డ్రైవర్ అతివేగంగా వచ్చి ఆటోను వెనక నుంచి ఢీకొట్టాడు. దీంతో ఆటో డైవర్ గువ్వల నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందగా ముగ్గురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మోహన్‌లాల్

అమ్రాబాద్, ఏప్రిల్ 18: మండలంలోని అన్ని గ్రామాలను సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో మోహన్‌లా ల్ అన్నారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీకార్యదర్శులు, గ్రామాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి రోజూ తాగునీటి సరఫరా చేయాలని, పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు రోజూ రూ. 270 నుంచి 300ల కూలి అందేలా చూడాలన్నారు. నర్సరీల్లో మొక్కలు ఎండకుండా నీరు అందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిన్నారి ఆపరేషన్‌కు ఆర్థికసాయం

అచ్చంపేట, ఏప్రిల్ 18: పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ జీహెచ్ఎం, అచ్చంపేట వాకర్స్ క్లబ్ గౌరవ సలహాదారు నర్సోజీ ఓ చిన్నారి గుండె ఆపరేషన్ కోసం రూ.10 వేలు అందజేశారు. సాయినగర్ కాలనీకి చెందిన ఉమామహేశ్వరి, రాఘవేందర్ దంపతులకు ముగ్గురు అమ్మాయిలు, కుమారుడు ఉండగా పెద్దకుమార్తె ప్రగతి గుండె సంబంధ వ్యాధితో బాధపడుతోంది. నిరుపేదలైన ఉమామహేశ్వరి దంపతులు చిన్నారి ఆపరేషన్ చేయించేందుకు ఇబ్బందులు పడుతుండగా విషయం తెలుసుకున్న నర్సోజీ తనకు వచ్చే పెన్షన్ డబ్బుల నుంచి రూ.10వేలు అందజేశారు.

దరఖాస్తుదారుల ఇంటింటి సర్వే

అమ్రాబాద్, ఏప్రిల్ 18: మండలంలోని వటవర్లపల్లిలో గురువారం ఆర్‌అండ్‌బీ ఏఈ లక్ష్మీపతి ఆధ్వర్యంలో పునరావాస ప్యాకేజీ కోసం దరఖాస్తు చేసుకున్న కుటుంబాల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఎన్టీసీఏ పథకంలో వటవర్లపల్లి గ్రామాన్ని విడిచి వెళ్లేందుకు 585 మంది దరఖాస్తుచేసుకున్నారని తెలిపారు. ఇందుకుగాను గ్రామంలో నివాసాల విలువ అటవీశాఖ అధికారులతో కలిసి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీట్ అధికారులు ముత్యాలు, శిల్పా, రీలొకేషన్ కమిటీ సభ్యులు బాలకృష్ణ, మక్సూద్, జానకిరాములు పాల్గొన్నారు

ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్

ఆగ్రో కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న చంద్రశేఖర్

వెల్దండ, ఏప్రిల్ 18 : ఎరువులు, విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ అన్నారు. గురువారం వెల్దండ మండల కేంద్రంలో ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆయన పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా డీలర్లకు స్టాక్ రిజిస్టర్‌లో ఎరువుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. పీవోఎస్ మిషన్ ద్వారా మాత్రమే ఎరువుల అమ్మకాలు జరపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మండల అధికారిణి మంజుల, డీలర్లు ఉన్నారు.

వచ్చేనెల 6వరకు ఫీజు చెల్లించాలి

కొల్లాపూర్, ఏప్రిల్ 18: ఓపెన్ డిగ్రీ (2023-24) మొదటి సంవత్సరం ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష ఫీజు మే 6వ తేదీ వరకు చెల్లించాలని ఓపెన్ డిగ్రీ స్టడీ సెంటర్ ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్, కో ఆర్డినేటర్ రమేశ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలు మే 26వ నుంచి జూన్ 1వ తేదీ వరకు ఉంటాయని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 18: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి సీతారాం గురువారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవిలో క్రీడాకారులకు శిక్షణా తరగతులు నిర్వహించతలపెట్టినట్లు పేర్కొన్నారు. శిక్షణ ఇ చ్చేందుకు క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు. సీనియర్ క్రీడాకారులైతే కనీసం జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ఉండాలని, దరఖాస్తుతోపాటు సంబంధిత క్రీడల్లో సాధించిన ధ్రువపత్రాలు జతపరచాలన్నారు. దరఖాస్తులను కలెక్టరేట్‌లోని రూం నెంబర్ ఎంజీ1లోని జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో వ్యక్తిగతంగా లేదా పోస్టుద్వారా ఈనెల 25వ తేదీలోగా అందజేయాలని పేర్కొన్నారు. వివరాలకు ఎం.జే అమరేశ్వర్ రావు, జూనియర్ అసిస్టెంట్ 9059174909 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఈజీఎస్ కూలీలకు వసతులు కల్పించాలి

- కల్వకుర్తి ఎంపీడీవో వెంకట్రాములు

పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న ఎంపీడీవో

కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 18 : గ్రామాల్లో ఈజీఎస్ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పని కేంద్రాల వద్ద వసతులు కల్పించాలని గ్రామ కార్యదర్శులకు ఎంపీడీవో వెంకట్రాములు సూచించారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈజీఎస్ కూలీలకు పని చేసే కేంద్రాల వద్ద తాగునీరు, టెంట్, మెడికల్ కిట్లను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులకు సంబంధించి రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో దేవేందర్, గ్రామపంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఉదయాన్నే పనులకు వెళ్లాలి

కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో బాలచందర్ సృజన్

అచ్చంపేటరూరల్, ఏప్రిల్ 18: ఎండ తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ కూలీలు ఉదయాన్నే పనులకు వెళ్లాలని ఎంపీడీవో బాలచందర్ సృజన్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని సింగారం, పెద్దతండా, ఎద్దుమిట్టతండా గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా